డిఇఒను కలిసిన ఉత్తమ ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-అనంతగిరి: రాష్ట్ర ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి చేతులు మీదుగా ఉత్తమ అవార్డులు అందుకున్న ఉపాధ్యాయులు శెట్టి .రాంబాబు, నరాజీ. మల్లేశ్వరరావులు జిల్లా విద్యాశాఖ అధికారి బ్రహ్మాజీరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఈ సందర్భంగా వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మండలంలోని తాము పనిచేసిన పలు పాఠశాలలో విద్యార్థులకు అంకిత భావంతో విద్యా బోధనలు అందిస్తున్నామన్నారు. ఉత్తమ అవార్డులు రావడం సంతోషదాయకమన్నారు. గిరిజన ప్రాంతంలో విద్యాభివృద్ధికి మరింతగా అంకితభావంతో కృషి చేస్తామన్నారు.

డిఇఒను కలిసిన టీచర్లు

రణభేరి జాతాను జయప్రదం చేయండి

పాడేరు, విఆర్.పురంలో పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి-పాడేరు: ఈనెల 15 నుంచి చేపట్టే యుటిఎఫ్ రణభేరి జాతాని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు వి.మహేశ్వర రావు పిలుపునిచ్చారు. పట్టణంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయం వద్ద రణభేరి కరపత్రాలను యుటిఎఫ్ నాయకులు శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం లోనూ తీవ్ర నిర్లక్ష్యం వహించడంతో మూడు సంవత్సరాల కాలం పోరుబాట చేసామన్నారు. అయినా గత ప్రభుత్వం స్పందించకపోవడంతో తగిన మూల్యం చెల్లించుకోవలసి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలు గడిచిపోయిందని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో ఏమాత్రం చొరవ చూపకపోవడం తగదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఆర్థిక బకాయిలన్నీ చెల్లింపు, పిఆర్‌సి కమిటీ వేస్తారని,ఐఆర్ 30శాతం శాతం చెల్లిస్తారని ఆశించిన ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు భంగపాటు తప్పలేదన్నారు. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులందరికీ అన్ని రకాల పెన్షన్ బెనిఫిట్స్ ఇస్తారని ఆశించిన ఉద్యోగులకు ఉపాధ్యాయులకు నిరాశే మిగిలిం దన్నారు. ముఖ్యమంత్రి నుండి ఇప్పటివరకు ఉద్యోగుల ఆర్థిక బకాయిలు చెల్లింపు పై ఎలాంటి స్పందన లేకపోవడంతో యుటిఎఫ్ ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా రణభేరి జాతా కార్యక్రమాన్ని ఈనెల 15 నుంచి 19 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రణభేరి కార్యక్రమం ఈనెల 18న అరకు లోయ నుండి ప్రారంభమై 18 సాయంత్రం వి.మాడుగుల లో ముగుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమలో జిల్లాలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు టి.చిట్టిబాబు, జిల్లా కార్యదర్శులు యమ్.ధర్మా రావు, పి.దేముడు, యస్.కన్నయ్య, ఆడిట్ కమిటీ సభ్యులు కె.రఘునాథ్, యల్.నారాయణ, సీనియర్ నాయకులు యస్.రాంబాబు పాల్గొన్నారు.

విఆర్‌పురం: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫేడరేషన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 15 నుంచి రణభేరి బైక్ జాతా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుండి ప్రారంభం అవుతుందని యుటిఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎన్.జగదీష్ తెలిపారు. ములకనపల్లిలోని జిపిఎస్ పాఠశాల వద్ద రణభేరి బైక్‌జాతా వాల్‌పోస్టర్‌ను శనివారం మండల కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. మండల కార్యదర్శి ఎన్.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీరు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలు పాలకులకు పట్టడం లేదని, నాణ్యమైన విద్యనందిస్తామని చెబుతూనే ప్రభుత్వ పాఠశాలల నుండి ప్రైవేట్ పాఠశాలకు విద్యార్థులు తరిలిపోయేలా కార్యక్రమాలు రూపొందిస్తున్నారన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభంలోనే శిక్షణ పేరుతో ఉపాధ్యాయులను పాఠశాలలకు దూరం చేసారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాము, ఎన్.చిన్నప్రసాద్, బి.సీతారామ రాజు ఎన్.ప్రసాద్, జోగారావు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలను రద్దు చేయాలి

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ఆదివాసి గిరిజనులకు నష్టం కలిగించే హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని వైసిపి మండల అధ్యక్షుడు పి పరశురాం డిమాండ్ చేశారు శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ఏజెన్సీలో చేపట్టనున్న హైడ్రో పవర్ ప్రాజెక్టుపై గిరిజన మంత్రి ద్వంద్వ వైఖరిని అవలంబిస్తున్నారని విమర్శించారు. ఈ ప్రాజెక్టులతో గిరిజనులకు ఒరిగిందేమీ లేదని, బడా కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చడానికే ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని విమర్శించారు. తక్షణమే ఆ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

మాట్లాడుతున్న గ్రామస్తులు

గిరిజన విద్యపై ప్రభుత్వ నిర్లక్ష్యం

-చంద్రబాబు హయాంలో మెడికల్ కాలేజీ తెచ్చారా : ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్రంలో గిరిజన విద్యారంగంపై కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహించిందని స్థానిక శాసన సభ్యులు వైసీపీ అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు విమర్శించారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు నియోజకవర్గంలో ఐదు మండలాల్లో సుమారు 86 పాఠశాలల్లో ఈరోజు వరకు ఉపాధ్యాయులు లేకపోవడం చాలా బాధాకరమన్నారు. పాఠశాలలు తెరుచుకుని నాలుగు నెలలు గడిచినా ఉపాధ్యాయులు లేక విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతు న్నారన్నారు.విద్యార్థులకు విద్య బోధన అందక చాలా ఇబ్బందులు పడుతుంటే ప్రభుత్వం, అధికారులు పట్టించుకోలేదన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయంలో జగన్మోహన్ రెడ్డి గిరిజన ప్రాంత విద్యార్థులు బాగుండాలని మంచి సంకల్పంతో నాడు నేడు ద్వారా కార్పొరేట్ పాఠశాలల మాదిరిగా రూపు రేఖలు మార్చి ప్రతి పాఠశాలల్లో మంచి విద్యా బోధన అందించారని తెలిపారు. ఆనాడు 17 మెడికల్ కాలేజీ లు తీసుకొచ్చి పనులు ప్రారంభించారని తెలిపారు. చంద్రబాబు నాయుడు పబ్లిసిటీ కోసం బహిరంగ సమావేశాల్లో మెడికల్ కాలేజీలు తీసుకొచ్చిందని తానే అని చెప్పుకోవడం చాలా హాస్యస్పదంగా ఉందన్నారు. గత 15 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా కొనసాగిన చంద్రబాబు ఒక్క మెడికల్ కాలేజ్ నిర్మించలేకపోయారని హెద్దేవా చేశారు. మెడికల్ కాలేజీలను చంద్రబాబు నాయుడు ప్రైవేటీకరణ చేస్తున్నారని సమాచారం తెలిసిందని, పాడేరు మెడికల్ కాలేజ్ గిరిజన ప్రాంత ప్రజలకు ఎంతో వరం అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రచార కమిటీ కార్యదర్శి కూతంగి సూరిబాబు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురస పార్వతమ్మ, నియోజక వర్గ మహిళా అధ్యక్షురాలు కిల్లో ఊర్వశి రాణి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు శరభ సూర్యనారాయణ, కించూరు సర్పంచ్ వంతాల రాంబాబు, క్రిస్టియన్ మైనారిటీ విభాగం నాయకులు మోద బాబూరావు, ఐటీ విభాగం నాయకులు కూడా సుబ్రమణ్యం, పాడేరు మండల యూత్ అధ్యక్షులు గల్లెలి లింగమూర్తి, మాజీ సర్పంచ్ మినుముల కన్నపాత్రుడు పాల్గొన్నారు,

మాట్లాడుతున్న బీట్ అధికారి

రంగురాళ్ల తవ్వకాలపై నిరంతర నిఘా

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి అటవీ డివిజనల్ అధికారి (డిఎఫ్ఓ) వైవి నర్సింగరావు ఆదేశాలతో, పెదవలస ఇంచార్జ్ రేంజ్ అధికారి జే ప్రశాంతకుమారి సూచనల మేరకు రంగురాళ్ల అక్రమ తవ్వకాలను అరికట్టడానికి సిగినాపల్లి క్వారీ వద్ద బేస్ క్యాంప్ ఏర్పాటు చేసి నిరంతర నిఘా పెట్టినట్లు రంపుల బీట్ అధికారి డి గోపి అన్నారు. ఈ సందర్భంగా బీట్ అధికారి మాట్లాడుతూ, అక్రమ తవ్వకాలకు పాల్పడిన లేదా వాటిని ప్రోత్సహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ చట్టాల ప్రకారం వారిపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. క్వారీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తే వారిపై కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అధికారుల సూచనల మేరకు, క్వారీ కొండపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే బేస్ క్యాంప్‌ను ఏర్పాటు చేసి, అధికారులు వంతుల వారీగా గస్తీ నిర్వహిస్తున్నారు. ఈ అటవీ నేరాలను అరికట్టడంలో స్థానిక ప్రజల సహకారం చాలా అవసరమన్నారు., అక్రమ కార్యకలాపాల గురించి సమాచారం తెలిస్తే వెంటనే అటవీ అధికారులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చింతపల్లి, పెదవలస బేస్ క్యాంప్ సిబ్బంది బాలరాజు, రామారావు తదితరులు ఉన్నారు.

సోలార్ వాటర్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-చింతపల్లి : చింతపల్లి మండలం బెన్నవరం పంచాయతీ పరిధిలో జల్ జీవన మిషన్ నిధులతో సోలార్ వాటర్ షెడ్ నిర్మాణానికి శనివారం సర్పంచ్ బచ్చుల సన్యాసమ్మ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించడమే ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. సోలార్ ప్లాంట్ ద్వారా విద్యుత్ వినియోగాన్ని తగ్గించడమే కాకుండా, పర్యావరణహితంగా నీటి సరఫరా సదుపాయం కల్పించబడుతుందని వివరించారు. కార్యక్రమంలో టిడిపి అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు పూజారి నారాయణమూర్తి, పీసా ఉపాధ్యక్షుడు ఉల్లి రమణ, డిప్పల రాజు, సతీష్, మాజీ ఎంపీటీసీ సోలభం కర్రి నాయుడు, జనసేన నాయకుడు కారేగి మచ్చరాజు, వంజారి వరాహల నాయుడు, వైకాపా నాయకులు బచ్చులి బొజ్జన్న దొర, యోసేపు, నవీన్ హెూనాక్ తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్

కింద్రలో విజృంభించిన చికున్‌గున్యా

- ఆందోళనలో స్థానికులు
- గ్రామాల్లో స్టేట్ జాయింట్ డైరెక్టర్ బృందం సర్వే
- వైద్యశిబిరాలు కొనసాగిస్తాం
- ఎవరూ ఆందోళన చెందొద్దన్న వైద్యులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలోని కింద్ర గ్రామంలో 19 మందికి చికున్‌గున్యా సోకినట్టు అధికారులు వెల్లడించడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల రాజవొమ్మంగి,కింద్ర, లాగరాయి,లబ్బర్తి గ్రామాల్లో కాళ్ళవాపు, జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పై కాకినాడ రంగరాయ మెడికల్ కళాశాల వైద్యబృందం కింద్ర గ్రామంలో 21 మంది నుండి రక్తనమూనాలు తీసుకువెళ్లారు. వారిలో 19 మందికి చికున్‌గున్యా ఉన్నట్లు నిర్ధారణ అయ్యిందని రంపచోడవరం అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ డేవిడ్ తెలిపారు. శుక్రవారం విజయవాడ నుండి జాయింట్ డైరెక్టర్, రాష్ట్ర ట్రైబల్ నోడల్ ఆఫీసర్, ముగ్గురు సూపర్‌వైజర్లు వచ్చి కింద్రలో ఇంటింటా సర్వే చేశారని, ఐదుగురు నుండి రక్తపూతసేకరణ చేశారని డాక్టర్ డేవిడ్ తెలిపారు. శనివారం కూడా మిగతా సర్వే చేసినట్లు డేవిడ్ తెలిపారు. గ్రామాల్లో దోమతెరలు పంపిణీకి రంగం సిద్ధం చేశామని వెల్లడించారు. గ్రామంలో మెడికల్ క్యాంపులు కొనసాగుతాయని ప్రజల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మందులు అందుబాటులో ఉన్నట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఇంటింటికి వెళ్లి మాట్లాడుతున్న వైద్యుల బృందం

వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

ముల్లూరులో వైద్యశిబిరం

ప్రజాశక్తి-కూనవరం: మండలంలోని ముల్లూరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద కూటూరు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామంలో 11 మంది జ్వరపీడితులకు రక్తనమూనాలు సేకరించి గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ వర్షాకాలంలో ఆరోగ్యవిషయంలో జాగ్రత్తలు పాటించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రతిఒక్కరూ వైద్యపరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం సర్పంచ్ బొగ్గా వెంకమ్మ మాట్లాడుతూ దోమతెరలు అందించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకమ్మ, హెల్త్‌అసిస్టెంట్ రాము, ఎఎన్ఎంలు లలిత, అరుణ, ఆశా కార్యకర్తలు మహాలక్ష్మి,రాధ, సుబ్బలక్ష్మి పాల్గొన్నారు.

జెసిబితో తొలగిస్తున్న బండరాళ్లు

రహదారిపై బండరాళ్ల తొలగింపు

ప్రజాశక్తి -కొయ్యూరు : కొయ్యూరు మండలంలోని డౌనూరు, తులబాడగెడ్డ సమీపంలో చింతపల్లి నుంచి నర్సీపట్నం వెళ్లే ప్రధాన రహదారి మధ్యలో శనివారం కొండ చరియలు విరిగిపడ్డాయి. పెద్దపెద్ద బండరాళ్లు రోడ్డుకు అడ్డంగా పడడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న కొయ్యూరు సిఐ శ్రీనివాసరావు తక్షణం జెసిబితో బండరాళ్లను తొలగించేందుకు చర్యలు చేపట్టారు. అనంతరం రాకపోకలను పునరుద్ధరించారు.

నిర్వాసితుల సమస్యలపై పరిశోధన

దేవీపట్నం- ప్రజాశక్తి: మండలంలో పోలవరం నిర్వాసితుల సమస్యలపై పరిశోధనకు జార్ఖండ్ రాష్ట్రం నుండి ది సోమ్ ట్రైబల్ లీడర్స్ జాతీయ పరిశోధన టీమ్ రానున్నట్టు ఎపి ఆదివాసీ జెఎసి రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, ఎపి ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎస్.మురళి ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దభీంపల్లి 2, ఆర్అండ్ఆర్ కాలనీ పెద్ద భీంపల్లి 3 కొండమొదలు కాలనీ సందర్శించి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటారన్నారు. 15వ తేదీన తున్నూరు గ్రామాన్ని సందర్శించి కొండరెడ్డి తెగ ప్రజలు ఇబ్బందులు తెలుసుకుంటారని, అదేరోజు సాయంత్రం రంపచోడవరం ఐటిడిఎ పిఒతో ఆదివాసీ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తారని, అలాగే 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ ఆంధ్రా, తెలంగాణ విలీన ముంపు మండలాలైన చింతూరు, విఆర్‌పురం, కూనవరం,ఎటపాక మండలాలను సందర్శించి నిర్వాసితులతో మాట్లాడతారన్నారు. జిఒ నంబర్ 3 రద్దు చేయటం వలన ఆదివాసీ పట్టభద్రులకు జరుగుతున్న అన్యాయం గురించి, 1/59 చట్టం,1/70 చట్టం, పీసా చట్టం, అటవీ హక్కుల చట్టం, 2013 భూసేకరణ చట్టం హక్కులు ఏవిధంగా అమలవుతున్నాయో, ఆదివాసీ సంస్కృతి సాంప్రదాయాలు ఏవిధంగా అమలవుతున్నాయో తెలుసుకోవటం జరుగుతుందన్నారు. అనంతరం చింతూరు ఐటిడిఎ పిఒతో మాట్లాడతారని పరిశోధించనున్నారని తెలిపారు.

వ్యాపారులతో మాట్లాడుతున్న పిఒ స్మరణ్‌రాజ్

వారపు సంత పరిశీలన

ప్రజాశక్తి-మారేడుమిల్లి: మారేడుమిల్లి వారపు సంతను ఐటిడిఎ పిఒ బచ్చు స్మరణ్‌రాజ్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. సంతలో అమ్ముతున్న వివిధ రకాల కూరగాయలను, పప్పు దినుసులను అన్ని రకాల సామాగ్రిని పరిశీలించారు. అధిక ధరలకు సరుకులు విక్రయించరాదని వ్యాపారస్తులకు సూచించారు. నాణ్యమైన వస్తువులను ప్రజలకు అందించాలని సూచించారు. కొండ వెదురుతో తయారు చేసిన చేటలను, బుట్టలను, పరిశీలించి ఏ విధంగా తయారు చేస్తారో అడిగి తెలుసుకున్నారు. మారేడుమిల్లి సిఐ నరేంద్రప్రసాద్, మారేడుమిల్లి ఎస్సై శ్రీనివాస్, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముహూర్తపు రాట వేస్తున్న నిర్వాహకులు

దసరా ఉత్సవాలకు ముహూర్తపు రాట

ప్రజాశక్తి -సీలేరు: జికె వీధి మండలం సీలేరు దుర్గాదేవి షెడ్‌లో దసరా ఉత్సవాలు పురస్కరించుకుని శనివారం నిర్వాహకులు ముహూర్తపు రాట వేశారు. కార్యక్రమంలో భవానీ మాలధారులు పాల్గొన్నారు. ముందుగా అర్చకులు వానపల్లి అప్పారావు దంపతులచే పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 22 నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు నవరాత్రులు నిర్వహించేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి పిల్ల సాంబమూర్తి సర్పంచ్ పాంగి దుర్గో, ఉప సర్పంచ్ వల్లి ప్రసాద్ కూటమి నాయకులు బోర్రకృష్ణ, చిటికెల రాము, కాశి గోవిందు ఎపి జెన్కో ఉద్యోగులు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సతీష్‌కుమార్ కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- జికె వీధి : మండలంలోని కె.కోడిసింగి గ్రామనికి చెందిన జనసేనపార్టీ కార్యకర్త సతీష్ కుమార్ మృతి చెందిన విషయం విధితమే. అరకు పార్లమెంట్ జనసేన పార్టీ ఇన్‌చార్జి జానపద కళల సృజనాత్మక అకాడమీ చైర్మన్ డాక్టర్ వంపూరు గంగులయ్య ఆదేశాల మేరకు మండల జనసేన పార్టీ నాయకులు సతీష్ కుటుంబసభ్యులను శనివారం పరామర్శించి ఓదార్చారు. సతీష్‌కుమార్ ఆత్మకు శాంతి కలగాలని నివాళులర్పించారు. జనసేన పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన పార్టీ పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్రె వీర వెంకట్, దేవరపల్లి ఉపాధ్యక్షులు కళ్యాణ్ చక్రవర్తి, గుండ్లు రఘువంశి, జనసేన పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గబులంగి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శిస్తున్న మండల జనసేన నాయకులు

నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి- కొయ్యూరు: కొయ్యూరు మండలం మంప గ్రామంలో నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని మంప ఎస్ఐ శంకరరావు శుక్రవారం తెలిపారు. ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలిసి మంపలో తనిఖీలు నిర్వహించగా నాటుసారా విక్రయిస్తూ అప్పారావు, సత్తిబాబు పట్టుబడ్డారన్నారు. వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామ న్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

కుళాయి ప్రారంభం

ప్రజాశక్తి - జికెవీధి : మండలం లోని పెదవలస పంచాయతీ రంపులుటెంట్లవీధి గ్రామంలో సర్పంచ్ పాంగి కృష్ణారావు ఆధ్వర్యంలో కుళాయిలు శనివారం ప్రారంభించారు. తాగునీటి సమస్య తీర్చినందుకు సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం లో వైస్ ఎంపిపి సప్పగెడ్డ ఆనందరావు, లమ్మసింగి రమేష్, వార్డు మెంబర్ కాంతమ్మ, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలి

ప్రజాశక్తి-రంపచోడవరం : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్స్, గూడ్స్ వెహికల్ డ్రైవర్స్, వాహనదారులతో రోడ్డు భద్రత అవగాహనపై శనివారం సమావేశం నిర్వహించారు. సిఐ సన్యాసినాయుడు మాట్లాడుతూ వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా డ్రైవింగ్‌లైసెన్స్ కలిగి ఉండాలని, వెహికల్ ఇన్సూరెన్స్, ఇతర పత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని, ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించ రాదని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రంపచోడవరం ఎస్ఐ వెంకటరావు, అడిషనల్ ఎస్ఐ భూషణం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ సన్యాశినాయుడు

సెల్ టవర్ ఏర్పాటు చేయాలి

విల్లేకరులతో మాట్లాడుతున్న గిరిజనులు

ప్రజాశక్తి -అనంతగిరి: మండలంలో మారుమూల నాన్ షెడ్యూల్ రొంపలి పంచాయతీ కేంద్రంలో సెల్ టవర్ ఏర్పాటు చేయాలని గిరిజనులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వార్డు మెంబర్ ఎస్.అప్పలరాజు, గ్రామస్తులు కె.సింహాచలంలు మాట్లాడుతూ, పంచాయతీ కేంద్రానికి సెల్ సిగ్నల్ సదుపాయం లేక మారుమూల గ్రామల ప్రజలు సమాచారం తెలుసుకునేందుకు తీవ్ర అవస్థలకు గురవుతున్నారని. తెలిపారు. తక్షణమే ప్రభుత్వం సెల్ సిగ్నల్ సౌకర్యం అందించాలని వారు డిమాండ్ చేశారు. పంచాయతీలో 13 రెవెన్యూ గ్రామాల్లో 2000 మంది జనాభా పైగా నివసిస్తున్నామని, కొండ శిఖరున బురిగా, చిన్న కోనెలా, కుందెలగుడ్డి ఇతర గ్రామాల నుండి పంచాయతీ కేంద్రానికి వెళ్లాలంటే 15 కిలోమీటర్ల దూరం కాలినడకన వెళ్ళవలసి వస్తుందని తెలిపారు. తక్షణమే సెల్ టవర్ ఏర్పాటు చేయకుంటే మండల కేంద్రంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని డిమాండ్ చేశారు, ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు,

విద్యార్థులకు స్టీల్ కంచాల పంపిణీ

స్టీల్ కంచాలు అందజేస్తున్న శ్రీరామ్మూర్తి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్నిగ్ధ శ్రీదేవి ఫౌండేషన్ ఆర్థిక సాయంతో అల్లూరి జిల్లా అనంతగిరి మండలం, నక్కుల మామిడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు 40 భోజన కంచాలను ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తి శనివారం అందజేశారు. ఫౌండేషన్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో యుటి ఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, పాఠశాల ఉపాధ్యాయులు జి గోవిందరావు, యు రాంబాబు, లక్ష్మణరావు పాల్గొన్నారు

డుంబ్రిగుడలో వర్షం

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు కించుమండ, అరకు, గుంటసీమ ప్రాంతాల్లో వర్షం కురిసింది. ఉదయం నుంచి ఐదు గంటల వరకు ఎండ కాసి సాయంత్రం వర్షం కురిసింది. ఈ వర్షంతో వ్యవసాయ పంటలు సాగు చేసి ఉన్న గిరి రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

రహదారి పక్కన పిచ్చిమొక్కలు తొలగించాలి

ప్రజాశక్తి - కొయ్యూరు: కొయ్యూరు మండలం చింతలపూడి రహదారి శిథిలమై అనేకచోట్ల వాహనాలకు ప్రమాదం పొంచి ఉంది. అదేవిధంగా రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో మలుపుల్లో ఎదురుగా వచ్చే వాహనాలు కనపడడం లేదని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. చింతలపూడి, గింజర్తి దేగలపాలెం కొమ్మిక తుమ్మలబంద బాలారం కంటారం, కించలి కిష్టారం ఆడాకుల మీదుగా నాతవరం చేరుకునేందుకు ఇది దగ్గర దారి. తుని వెళ్లేవారు సైతం ఇదే మార్గంలో వెళతుంటారు. గతంలో నాణ్యత లేకుండా ఈ రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం శిథిలమై రాళ్లు తేలిపోయి ప్రయాణానికి తీవ్ర ఇబ్బంది పడాల్సి వస్తోందని పలువురు అంటున్నారు. అధికారులు స్పందించి కొత్త రోడ్డు మంజూరు చేయాలని, ఉపాధి పనుల ద్వారా రహదారికి ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

లోక్అదాలత్ నిర్వహిస్తున్న న్యాయసేవాధికార కమిటీ

జాతీయ లోక్ అదాలత్‌లో 91 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి-రంపచోడవరం : మండల న్యాయసేవాధికార కమిటీ, అడ్డతీగల, రంపచోడవరంలో శనివారం జాతీయ లోక్అదాలత్ నిర్వహించారు. అడ్డతీగలలో 14 క్రిమినల్ కేసులు, రంపచోడవరంలో 77 క్రిమినల్ కేసులను పరిష్కరించారని మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్ జెఎఫ్‌సి మేజిస్ట్రేట్ ఎం.మురళి, గంగాధరరావు తెలిపారు. కార్యక్రమంలో బెంచ్ మెంబెర్స్ శ్రీధర్, వీరబాబు అడ్వొకేట్స్ ఎం.వి.ఆర్ ప్రకాష్, ఎఆర్ఆర్ భగవాన్, చుక్క సంతోష్‌కుమార్, డి లక్ష్మీనారాయణ, ఎం.రవితేజ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి

ప్రజలను మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - రంపచోడవరం : చంద్రబాబు ష్యూరిటి -మోసం గ్యారెంటీ కార్యక్రమం రంపచోడవరం మండలం చినభిరంపల్లిలో శనివారం నిర్వహించారు. సమావేశానికి రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ప్రజలను మోసం చేసిందని అందుకే వారి తరపున ప్రజల గొంతుకై వైసిపి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రతిపక్ష నాయకులపై తప్పుడు కేసులు బనాయించేందుకు శ్రద్ధ చూపిస్తున్న కూటమి ప్రభుత్వంపై ప్రజల తరపున పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు.

కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, ఎంపిపి, జెడ్‌పిటిసి, వైస్ఎంపిపిలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు, ఎంపిటిసిలు, వార్డ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలతో సమస్యల పరిష్కారం

సిఐటియు నేతలు చిన్నయ్య పడాల్, సత్యనారాయణ

ప్రజాశక్తి-చింతపల్లి : కార్మికుల సమస్యలు ఐక్యపోరాటాల ద్వారానే పరిష్కారమవుతాయని సిఐటియు జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్యపడాల్, జిల్లా సహాయ కార్యదర్శి గడుతూరి సత్యనారాయణ అన్నారు. సిఐటియు ప్రజా సంఘాల మండల సమన్వయ కమిటీ సమావేశం శనివారం పెంటమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా చిన్నయ్యపడాల్, సత్యనారాయణ మాట్లాడుతూ, కార్మికులంతా ఒకే తాటి మీద నిలబడి ప్రభుత్వాలపై ఐక్యంగా పోరాడితే పరిష్కారం కాని సమస్య ఏదీ ఉండదని పేర్కొన్నారు. వైఎస్.జగన్ ప్రభుత్వ కాలంలో అంగన్వాడీల ఉద్యమం రాష్ట్రవ్యాప్తంగా చరిత్రాత్మకంగా సాగి సమస్యల పరిష్కారం దిశగా మలుపు తిప్పిందని గుర్తు చేశారు. ఉమ్మడి ఎపి రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో అంగన్వాడీ కార్యకర్తలపై గుర్రాలతో తొక్కించిన ఘటన తరువాత పదేళ్ల పాటు అధికారానికి దూరమయ్యారని గుర్తు చేశారు. ప్రభుత్వాలు మారినా కార్మికుల స్థితిగతులు మారలేదని, బలమైన పోరాటాల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని చెప్పారు. సమావేశంలో సాగిన చిరంజీవి,

మాట్లాడుతున్న సత్యనారాయణ

పెంటమ్మ, వెంకటి, గసాడి లక్ష్మి, చిన్నారి, ఇందు, సత్య, తేజ, సత్తిబాబు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పెదబరడ పంచాయతీలో

రెండో సచివాలయాన్ని ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-చింతపల్లి : మండలంలోని పెదబరడ పంచాయతీలో ఆయా గ్రామాల ప్రజల సౌకర్యార్థం రెండో సచివాలయం ఏర్పాటు చేయాలని జనసేన పెదబరడ పంచాయతీ అధ్యక్షుడు కూడ రామకృష్ణ కోరారు. చింతలూరు, వంగసార, పెద్దగడ్డ, కొమ్మల బంధ, నక్కల మెట్ట, గున్నమామిడి, నరహరి వీధి, లోతుగడ్డ జంక్షన్, భీమన్న వీధి, కృష్ణాపురం గ్రామస్తులు సుమారు 19 వందల మంది సంతకాలతోపాడేరు ఐటీడీఏలో జరిగిన మీకోసం కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ తిరుమణి శ్రీ పూజకు వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి జనసేన నాయకుడు రామకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం పెదబరడ పంచాయతీలో ఉన్న సచివాలయం పరిధిలోని ఆ 10 గ్రామాలలో సుమారు 4500 పై చిలుకు జనాభా కలిగి ఉన్నామని, సచివాలయ సేవలు పొందాలంటే సుదూర ప్రాంతమైన పెదబరడ ఆయా గ్రామాలకు 10 నుంచి 15 కిలోమీటర్ల దూరం ఉందని అన్నారు. దీంతో వివిధ ధ్రువపత్రాలు, సంక్షేమ పథకాల సమాచారం నిమిత్తం సచివాలయ సేవలు పూర్తిస్థాయిలో పొందలేకపోతున్నామన్నారు. గతంలో రెండో సచివాలయం మంజూరైన కొందరి స్వార్థ రాజకీయాల కారణంగా అది కార్యరూపం దాల్చలేదని వాపోయారు. సచివాలయానికి దూరంగా ఉన్న గ్రామస్తులు క్యాస్ట్ సర్టిఫికేట్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు, ఆధార్ మార్పిడి వంటి అవసరల నిమిత్తము వ్యయ ప్రయాసల కోర్చి సుదూర ప్రాంతంలో ఉన్న సచివాలయంకి వెళ్లాలంటే ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై దృష్టి సారించి 10 గ్రామాల సౌకర్యార్థం రెండవ సచివాలయాన్ని మంజూరు చేసి అందుబాటులో ఉన్న ప్రాంతంలో నిర్మించాలని కోరారు. పెద్ద గడ్డ నుండి గున్న మామిడి వరకు రహదారి సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సంకాడ పంచాయతీ అధ్యక్షులు ఊలం ఈశ్వరరావు, ఆయా గ్రామస్తులు కొర్ర సతీష్, గెమ్మెలి సాయిబాబు, గెమ్మెలి నాయుడు, కిల్లో శ్రీను, పాంగి చందు, గెమ్మెలి తేజ తదితరులు పాల్గొన్నారు.

15న ఎయులో ప్రజాస్వామ్య దినోత్సవం

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: ఆంధ్ర విశ్వవిద్యాలయం రాజనీతి, ప్రభుత్వ పాలనా శాస్త్రం, ఇనిస్టిట్యూట్ ఫర్ డెమొక్రటిక్ ఎంగేజ్మెంట్ అండ్ అకౌంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఎయు విసి ఆచార్య జి.పి రాజశేఖర్ తెలిపారు. శనివారం తన కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఐక్యరాజ్యసమితి సెప్టెంబర్ 15వ తేదీని అంతర్జాతీయ ప్రజాస్వామ్య దినోత్సవంగా ప్రకటించిందని, ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పొలిటికల్ సైన్స్‌విభాగంలో ప్రతిష్టాత్మకంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పూర్వ రాజ్యసభ సభ్యులు, విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షులు పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ హాజరవుతున్నారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి ఆర్ రాజు, విభాగాధిపతి ఆచార్య పేటేటి ప్రేమానందం, డీన్ ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య జి.ఎం.జె రాజు, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ టి.నాగరాజు, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎయు విసి, తదితరులు

ప్రైవేట్ సెక్టార్లలో ఉపాధి కల్పనకు చర్యలు

ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్

ప్రజాశక్తి - రంపచోడవరం : ఏజెన్సీలో చదువుకున్న యువతకు ప్రైవేట్ సెక్టార్లలో ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా తగు చర్యలు చేపడతామని రంపచోడవరం ఐటిడిఎ పిఒ స్మరణరాజ్ పేర్కొన్నారు. శనివారం సాయిబాబా ఆలయం సమీపంలోని భాను సప్తై ఫంక్షన్ హాల్ అంబుజా స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్లో హెచ్‌డిఎఫ్‌సి సారథ్యంలో శిక్షణ పొందిన యువతకు ప్రైవేట్ సెక్టార్లలో ఉపాధి అవకాశాలు కల్పించడం చాలా గొప్ప విషయం అన్నారు. అంబుజా ఫౌండేషన్ ద్వారా కుట్టుమిషన్లు, ఎసి రిపేర్లు, కంప్యూటర్ శిక్షణ శిక్షణ పొందిన వారికి సొంతంగా ఏర్పాటు చేసుకునే వారికి లోన్లు ఏర్పాటు చేసేందుకు వెలుగు అధికారులను సంప్రదించవచ్చన్నారు. అంబుజా, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన వారిలో 70 శాతం ఎంపికైన వారికి పిఒ అభినందించారు. కార్యక్రమంలో అంబుజా ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీకాంత్, తులసిరామ్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ప్రతినిధులు మురళీకృష్ణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు ఇస్తున్న ఐటిడిఎ పిఒ స్మరణరాజ్

యువకుడు అనుమానాస్పద మృతి

హత్యేనంటున్న కుటుంబీకులు

ప్రేమ, కులం, డబ్బు కారణంతో అరుణాచలంలో మట్టుబెట్టినట్టు అనుమానం

పోలీసుల అదుపులో వెంకటాపురం మాజీ సర్పంచ్ భార్య, కుమార్తె ?

ప్రజాశక్తి - దేవరాపల్లి : అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలోని కాశీపురం గ్రామానికి చెందిన డెక్క నవీన్ (23) తమిళనాడు రాష్ట్రంలోని అరుణాచలంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈ ఘటనతో కాశీపురం ప్రాంతమంతా శనివారం విషాద ఛాయలు అలుముకున్నాయి. ఇది ముమ్మాటికీ హత్యేనని మృతుని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. పలువురి కథనం ప్రకారం.. జాతీయ స్థాయి అథ్లెటిక్స్ క్రీడాకారుడైన నవీన్ రెండు నెలల క్రితం ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం పొందాడు. కొంతకాలంగా ఆయన అచ్యుతాపురం మండలం సమీపంలోని పూడి గ్రామంలో ఉంటున్నాడు. అతని తల్లిదండ్రులు రాంబాబు, విజయ. ఈ నెల 8న ఉదయం 5.30 గంటలకు తీర్థయాత్రకు వెళ్తున్నానని చెప్పి నవీన్ ఇంటి నుంచి బయలుదేరాడు. బుధవారం అరుణాచలంలో ఉన్నానని వీడియో కాల్‌లో తల్లితో మాట్లాడాడు. అదే రోజు రాత్రి చెన్నయ్‌కు వెళ్తున్నానని తెలిపాడు. గురువారం ఉదయం అనూహ్యంగా ఒక యువకుడు ఫోన్ చేసి నవీన్ మేడ మీద నుంచి దూకి చనిపోయాడని చెప్పడంతో కుటుంబం షాక్‌కు గురైంది. తమ కొడుకు ఆత్మహత్య చేసుకునే అంత పిరికి వాడు కాదని, పథకం ప్రకారమే జరిగిన హత్య అని మృతుని తల్లిదండ్రులు రాంబాబు, విజయ ఆరోపిస్తున్నారు. తమ కుమారుడు ప్రేమించిన యువతి రాంబిల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సీర వెంకట్రావు కుమార్తె అని తెలిపారు. ఆమె తల్లి చిన్ని, బంధువులు కలిసి తీర్థయాత్ర పేరుతో నవీన్‌ను పిలిచి హతమార్చారని రాంబాబు, విజయ చెబుతున్నారు. ఈ కేసును నిష్పాక్షికంగా విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని హోం మంత్రి అనితను వారు కోరారు. ప్రేమిస్తే ఇంత దారుణంగా హతమారుస్తారా ? అంటూ విలపించారు. కాశీపురం గ్రామస్తులు కూడా ఈ సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. అరుణాచలం పోలీసులు ఇప్పటికే వెంకటాపురం గ్రామం మాజీ సర్పంచ్ భార్యను, కుమార్తెను అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. ప్రేమ, కులం, డబ్బు ఈ హత్యకు కారణమని గ్రామస్తులు చెబుతున్నారు.

నవీన్ (ఫైల్ ఫొటో)

భూకబ్జాదారునిపై చర్య తీసుకోవాలి

ప్రజాశక్తి -విశాఖ కలెక్టరేట్ : వంశపారంపర్యంగా వస్తున్న తమ భూమిని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని బాధితుడు కాయత శ్రీనివాస్ శనివారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కాపులుప్పాడలోని 350/12సిలో29 సెంట్లు భూమి తన తండ్రి కాయిత అప్పారావు పేరు మీద ఉందని, ఆన్‌లైన్‌లో కూడా అతని పేరు కనిపిస్తోందని, దశాబ్దాల కాలంగా ఈ భూమి తమ ఆధీనంలో ఉందని ఆయన మీడియాకు తెలిపారు.

గత కొంతకాలంగా ఓ వ్యక్తి ఈ భూమి తనది అని చెప్పి ప్రతిసారి వివాదం సృష్టిస్తున్నాడని దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. భీమిలిపట్నం ఎమ్మార్వో సర్వే చేసి ఈ స్థలం కాయిత అప్పారావుకే చెందుతుందని, వారసత్వంగా వస్తున్న ఈ స్థలం వారసులకే చెందుతుందని స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అయితే గత కొంతకాలంగా ఈ స్థలంపై కన్నేసిన దినేష్ రాజు ఆ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, ఇతనిపై పోలీస్‌స్టేషన్‌లో పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ కొన్నాళ్లు ఆగి, తిరిగి యథావిధిగా ఆ భూమిని ఆక్రమించేందుకు ఫెన్సింగ్ వేయడం, గోడ కట్టడం వంటివి కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నాడన్నారు. శుక్రవారం దినేష్ మళ్లీ కబ్జాకు ప్రయత్నిస్తుండగా, ఆ స్థలానికి చెందిన వారసులు పదిమంది పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. కలెక్టర్ తగు చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరారు .

15 నుంచి పశువులకు వ్యాక్సినేషన్

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఫుట్ అండ్ మౌత్ డిసీజ్ 7వ విడత టీకా కార్యక్రమం ఈనెల 15 నుండి అక్టోబర్ 15 వరకు నిర్వహిస్తామని మండల పశు వైద్య అధికారి చరణ్ శనివారం తెలిపారు. నాలుగు నెలల వయస్సు పైబడిన అన్ని పెద్ద జంతువుల (ఆవులు, ఎద్దులు, గేదెలు)కు ఈ టీకాలు ఉచితంగా వేయనున్నట్లు తెలిపారు. జంతువుల వ్యాధి వ్యాప్తిని అరికట్టి, ఆరోగ్యాన్ని కాపాడడమే ముఖ్యోద్దేశమని చెప్పారు. జంతువులను సమయానికి టీకా వేయించుకోవాలని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని చరణ్ కోరారు.

డాక్టర్ చరణ్

ప్రజాకవి ఆరుద్ర

● శతజయంతి వేడుకలో పలువురు వక్తలు

ఆరుద్రకు నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు, నిర్వాహకులు

ప్రజాశక్తి- సీతమ్మధార : కళ ప్రజల కోసమని నమ్మిన వ్యక్తి ప్రజాకవి ఆరుద్ర అని రచయిత విమర్శకులు మేడిపల్లి రవికుమార్అన్నారు. శనివారం పౌర గ్రంథాలయంలో సాహిత్య అకాడమీ, రైటర్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యాన భాగవతుల సదాశివ శంకర శాస్త్రి (ఆరుద్ర) శతజయంతి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కీలక ఉపన్యాసం చేసిన రవికుమార్ మాట్లాడుతూ, విశాఖలో జమిందారీ కుటుంబంలో పుట్టిన ఆరుద్ర, తాను. కవిత కోసం పుట్టానని, సామాజిక క్రాంతి కోసం కలం పట్టానని అన్నారన్నారు. ఇంట్లో మేనమామ వరసైన మహాకవి శ్రీశ్రీ , కుటుంబం ప్రభావం ఆరుద్రపై ఉందన్నారు. సమాజానికి చరిత్ర, పురోగతి ఉంటుందని శ్రీశ్రీ చెప్పారని, అది ఆరుద్ర పాటించారన్నారు.

ఇంటి పేరు, కులం పేరు వదులుకొని తనను తాను ఆరుద్ర నిరూపించుకున్నారని కొనియాడారు. సైన్స్ అభివృద్ధి చెందుతుందని, దాన్ని సమాజాభివృద్ధికి అన్వయించాలని భావించే ఆరుద్ర, మొదటి నుంచి శాస్త్రీయ దృక్పదాన్ని అలవరుచుకుని పాటించారని, సమాజంలో శ్రామిక వర్గం వైపు నిలబడ్డారన్నారు. సమాజం పట్ల నిబద్ధత గల వ్యక్తి ఆరుద్ర అని కొనియాడారు. రష్యాలో సోషలిజం పతనమైనా, చివరి వరకు మార్క్సిజాన్ని వదిలిపెట్టని ఆరుద్ర, ఎవరెన్ని కుట్రలు చేసినా మార్క్సిజానికి ప్రమాదం లేదని నమ్మే వారన్నారు.

సాహిత్య అకాడమీ కన్వీనర్ సి.మణాళిని స్వాగతోన్యాసం చేస్తూ ఆరుద్ర లాంటి కవుల శత జయంతి వేడుకల నిర్వహణ ద్వారా నేటి తరానికి తెలియజేసే అవకాశం దక్కడం ఆనందంగా ఉందన్నారు సదస్సుకు అధ్యక్షత వహించిన రైటర్స్ అకాడమీ అధ్యక్షులు వివి రమణమూర్తి మాట్లాడుతూ యువతకు సామాజిక అవగాహన ఉండాలని, కర్ణాటక తరహాలో ఇక్కడి పాఠశాలల్లోనూ విద్యార్థులకు అటువంటి ప్రోత్సహం అవసరమన్నారు. మేడా మస్తాన్ రెడ్డి వాఖ్యాతగా వ్యవహరించిన సదస్సులో గాంధీ సెంటర్ కార్యదర్శి వి బాలమోహన్‌దాస్, ఉస్మానియా యూనివర్సిటీ తెలుగు ప్రొఫెసర్ ఎస్ రఘు, రచయితలు తలతోటి పృధ్వీరాజు, అయ్యగారి సీతారత్నం, ఆచార్య బాబీ వర్ధన్, అనిల్ డ్యానీ, రాంబట్ల నృసింహశర్మ, బాల సుధాకర్‌మౌళి, చింతకింది శ్రీనివాసరావు, బులుసు వెంకటేశ్వర్లు, కెవిఎస్ మూర్తి, అనురాధ, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన నాయకులు

గిరిజన మండల సమితి ఎన్నిక

ప్రజాశక్తి -సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా జికె వీధి మండలం దారకొండ పంచాయతీ చిన్న గంగవరంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన సమైక్య మండల సమితి సమావేశం కవర్లు భగవాన్ అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన మండల సమితి ఎన్నిక ఆంధ్రప్రదేశ్ గిరిజన సమైక్య అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ, జిల్లా అధ్యక్షులు సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జికె వీధి మండల గిరిజన సమైక్య కార్యదర్శిగా పాంగి నాగేశ్వరరావు సహాయ కార్యదర్శిగా దర్సులు, బురిడీరాము, గొల్లూరి వినోదు, మండల అధ్యక్షుడిగా బలరాం ఉపాధ్యక్షులుగా కిలో రమేష్, అర్జున్, చిన్నారావు మండల సమితులు కిలో మహేష్, కిలో జలంధర్ నరియ రామకృష్ణ గంట కేశవరావు, మరిగెల బాలరాజు, బిందు భగవాన్, వంతలసొన్ను జర్త మల్లేష్, వంతల సొమ్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

'పాడేరు వైద్యకళాశాలకు గాంమల్లుదొర పేరు పెట్టాలి'

ప్రజాశక్తి-సీలేరు: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ప్రభుత్వ మెడికల్ కళాశాలకు గిరిజన స్వతంత్ర సమరయోధుడు విశాఖపట్నం మొట్టమొదటి పార్లమెంటు సభ్యుడు గాం మల్లుదొర పేరు పెట్టాలని కాంగ్రెస్ నాయకుడు కారే శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గాం మల్లుదొర ప్రముఖ గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు అని, 1955లో జరిగిన మొట్టమొదటి ఎన్నికల్లో విశాఖపట్నం నుండి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై సేవలు అందిం చారని గుర్తు చేశారు. పాడేరు మెడికల్ కళాశాలకు గామ్ మల్లదొర పేరు పెట్టాలని ఆకాంక్షించారు.

తృటిలో తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి- జికె వీధి : మండలంలోని పెదవలస చాపరాతిపాలెం గ్రామాల మధ్యలో శనివారం భారీ లారీ అదుపుతప్పి లోయవైపు ఒదిగిపోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. అటుగా వెళ్లే వాహనదారులు సమాచారం అందించడంతో జెసిబి తీసుకొచ్చి ఒరిగిపోయిన లారీని సరిచేశారు.

లోయ వైపునకు ఒరిగిన భారీ వాహనం

ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో ప్రసిద్ధి చెందిన సత్యనారాయణస్వామి ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే వంశీకృష్ణ తెలిపారు. దేవాలయానికి వెళ్లే ఘాట్‌రోడ్డు వద్ద రూ.16.80 లక్షలతో ఏర్పాటు చేస్తున్న లైట్లు, డ్రైనేజీ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవాలయానికి వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలని దీనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టామన్నారు.

ఘాట్‌రోడ్‌లో లైటింగ్ ఏర్పాటు, మిగిలిన సదుపాయాలు కల్పించి దేవాలయం రూపురేఖలు త్వరలో మారుస్తామన్నారు. అవసరమైన చోట నూతన కమ్యూనిటి హాల్స్ నిర్మిస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో రోడ్లు, డ్రైనేజీ, గ్రామాలకు ఆర్చిలు రెండు, మూడు మాసాలలో పూర్తి చేస్తామని తెలిపారు. ప్రజలు ఎటువంటి సమస్య ఎదురైనా సంప్రదించవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మాసిపోగు మేరిజోన్స్, జనసేన నాయకులు మాసిపోగు రాజు, ఆలయ ఇఒ రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.